జీవో 115 రగడ..

- ఏఎన్ఎంలకు, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు మధ్య చిచ్చు - రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జీవో నెంబర్ 115 స్టాఫ్ నర్సులు, ఎఎన్ఎంల మధ్య చిచ్చు పెడుతోంది. ఏఎన్ఎంలకు రెండేళ్లు శిక్షణ ఇచ్చి నేరుగా స్టాఫ్ నర్సులుగా తీసుకోవాలనే వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిర్ణయంపై కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు భగ్గుమంటున్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగిన నాటి నుండి నేటి వరకూ గత 13 సంవత్సరాలుగా శాశ్వత ప్రాతిపదికన ఒక్క ఉద్యోగానికి కూడా నోచుకోని స్టాఫ్ నర్సులు వివిధ కాంట్రాక్ట్ల పద్ధతిలో దశాబ్ద కాలంగా ఉద్యోగం చేస్తున్నారు. ఉద్యోగాలు ఎప్పటికైనా క్రమబద్ధీకరణ అవుతాయని ఎదురు చూస్తున్న తరుణంలో జీవో 115 జారీ చేయడంతో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు తమకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత దశాబ్ద కాలంగా శాశ్వత ప్రాతిపదికన ఒక్క ఉద్యోగానికి నోచుకోని స్టాఫ్ నర్సులు కాంట్రాక్ట్ పద్ధతిలో రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది పని చేస్తున్నారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో 2 వేల మంది పని చేస్తున్నారు. వీరంతా ఏళ్ల తరబడి సర్వీస్ చేస్తూ శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులుగా అనేక ఏళ్లుగా స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడమే కాక బిఎస్సీ నర్సింగ్ క్యాడర్‌లోకి జిఎన్ఎం చేసిన వారిని తీసుకొచ్చి స్టాఫ్ నర్సులుగా ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. మూడేళ్ల క్రితం సచివాలయాల్లో రెగ్యులర్ నర్సింగ్ పోస్టులకు బిఎస్సీ నర్సింగ్ చేసిన వాళ్లు దరఖాస్తు చేయనుకోవడానికి వెళితే తిరస్కరించి ఇప్పుడు జిఎన్ఎం క్యాడర్ వాళ్లను ఎలా తీసుకుంటారని స్టాఫ్ నర్సులు మండిపడుతున్నారు. ప్రస్తుతం వర్క్ అడ్జస్ట్మెంట్‌లో గ్రామ సచివాలయంలో రెండు సంవత్సరాలు అనుభవం కలిగిన ఎఎన్ఎంలను అర్హత ఉందని స్టాఫ్ నర్సులుగా తీసుకొని రెగ్యులర్ ప్రమోట్ చెయ్యటం వల్ల కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3,500 మంది ఎఎన్ఎంలను ఎంపిక చేసి 4 సంవత్సరాల 6 నెలలు ఇవ్వాల్సిన బిఎస్సీ నర్సింగ్, 3 సంవత్సరాల 6 నెలల జిఎన్ఎం శిక్షణను రెండేళ్లలోపు పూర్తి చేయించి వారిని నియమించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో బిఎస్సీ నర్సింగ్ చదువు పూర్తి చేసుకుని, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు వేల సంఖ్యల్లో బయట ఉన్నారు. బిఎస్సీ, ఎంఎస్సీ నర్సింగ్ చేసిన వారు స్టాఫ్ నర్సులుగా చేస్తున్నప్పటికి రెగ్యులర్ స్టాఫ్ నర్సులకు మాత్రమే హెడ్‌నర్సులుగా, నర్సింగ్ సూపరింటెండెంట్‌లుగా ప్రమోషన్లు ఉన్నాయి తప్ప కాంట్రాక్టు పద్ధతిలో పని చేసే వారికి ప్రమోషన్లు లభించడం లేదు. ఇక ఈ పోస్టులు రెగ్యులర్ కాకపోతే వీరు విరమణ పొందే వరకు అదే క్యాడర్‌లో వెట్టి చాకిరీ చేయాల్సిందే. వీటన్నింటినీ తట్టుకొని పని చేస్తుంటే ఇప్పుడు మరో సమస్యను ప్రభుత్వం తెచ్చి పెడుతుందని స్టాఫ్ నర్సులు అంటున్నారు. కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా తీసుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, జీవో 115ను రద్దు చేయాలని స్టాఫ్ నర్సులు డిమాండ్ చేస్తున్నారు.

అర్హత లేని వారిని స్టాఫ్ నర్సులుగా తీసుకోవడం అన్యాయం

అర్హత లేని వారిని స్టాఫ్ నర్సులుగా తీసుకోవడం అన్యాయం. ఈ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వం మొండిగా వెళితే ఆందోళనలు చేపడుతాం..

- ఎం.శైలజ, కాట్రాక్ట్ స్టాఫ్ నర్స్, నంద్యాల జిజిహెచ్ హాస్పిటల్.

జీవో 115ను రద్దు చేయాలి

స్టాఫ్ నర్సుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదు. సర్దుబాటు పేరుతో స్టాఫ్ నర్సుల్లో ఏఎన్ఎంలను నియమించడం వలన కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు అన్యాయం జరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

- వీరేష్, కాంట్రాక్టు స్టాఫ్ నర్స్ (మేల్), ఎమ్మిగనూరు.

కాంట్రాక్టు స్టాఫ్ నర్స్‌లకు అన్యాయం చేయొద్దు

గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం చేయడానికి పూనుకోవడం సరైన పద్ధతి కాదు. జీవో 115 విధానం వల్ల గత 15 ఏళ్లగా కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న స్టాప్ నర్సులు తీవ్రంగా నష్టపోతారు. ఈ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకొని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి.

- మంజుల దేవి, రాష్ట్ర అధ్యక్షురాలు, ఎపి ప్రభుత్వ నర్సెస్ సర్వీసెస్ అసోసియేషన్.

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం
- ప్రజాశక్తితో డిఇఒ శామ్యూల్ ముఖాముఖి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులకు ఉత్తమ బోధనే అందించడమే లక్ష్యంగా విద్యాశాఖ పని చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజన పథకం ద్వారా అమలు చేస్తున్నా మని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దృష్టి సారించా మన్నారు. ఈ సందర్భంగా డిఇఒ కె.శామ్యూల్ ప్రజాశక్తితో మాట్లాడారు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డిఇఒ : కర్నూలు జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లోని చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని ఉపాధ్యాయుల ద్వారా మరింత నాణ్యమైన బోధన అందేలా కృషి చేస్తున్నాం. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తయారు చేస్తాం. ఇప్పటికే అన్ని పాఠశాలలో డిజిటల్ బోర్డులు కూడా ఏర్పాటు చేశాం వాటి ద్వారా విద్యార్థులకు సబ్జెక్టులపై మరింత లోతైన అవగాహన కల్పిస్తున్నాం.

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పాఠశాలలకు విద్యార్థులు వచ్చే సంఖ్య తగ్గిపోతుంది..? అక్కడ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు ఎలాంటి చర్యలు చేపట్టారు..?

డిఇఒ : జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన ఆదోని పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. అక్కడ విద్యార్థుల తల్లిదండ్రులు వలసలకు వెళితే పిల్లల కోసం ప్రత్యేకంగా సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు బడి ఈడు పిల్లలందరినీ గుర్తించి బడి బయట ఉండకుండా పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాము. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించి వారికి విద్య ప్రాధాన్యత తెలియజేసి పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేలా చూస్తున్నాం.

జిల్లాలో ఇటీవల కాలంలో కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్స్ ప్రవేశాలకు అధికంగా డిమాండ్ ఉంది..? అడ్మిషన్ సీట్ల పెంపునకు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు కూడా విన్నవిస్తున్నాయి.. దీనిపై మీరేమంటారు..?

డిఇఒ : ఇటీవల కాలంలో కస్తూర్బా గాంధీ, మాడల్ స్కూల్స్‌తో పాటు ఇతర రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్ల కోసం సంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది. మోడల్ స్కూల్స్, కేజీబీవీ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలను అందులో ఉన్న సీట్లకు అనుగుణంగానే భర్తీ చేస్తున్నాం. ఇంకా సీట్లు పెంచాలని అనేక సంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. వాటిని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లాం. ఇప్పటికే జిల్లా కలెక్టర్ కూడా ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.

జిల్లాలో ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్ల భర్తీ ద్వారా ఎంపికైన విద్యార్థుల నుండి కొన్ని యాజమాన్యాలు ఫీజులను వసూలు చేస్తున్నాయి. అలాంటి యాజమాన్యాలపై ఏమైనా చర్యలు తీసుకున్నారా..?

డిఇఒ : ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ప్రత్యేకంగా ఫీజులను వసూలు చేయకూడదు. అలా చేస్తే సంబంధిత పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే విచారణ చేస్తాం. కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే సంబంధిత పాఠశాల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా విద్యాబోధన అందిస్తున్నాం.

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డిఇఒ : పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికను రూపొందించాం. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

మోడీవి అనాలోచిత విధానాలు

- సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దేశంలో మోసపూరిత మాటలతో ఎన్నికల్లో కెళ్ళి, జనతాదల్ (యు), టిడిపి మద్దతుతో మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి తన తిరోగమన విధానంతో దేశాన్ని భ్రష్టు పట్టించే విధానాన్ని మాత్రం వీడలేదని, నరేంద్ర మోడీ అనాలోచిత విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పిలుపు నిచ్చారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్లో సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధోన్మాదం పెచ్చరిల్లుతోందని, మానవహింసను తగ్గించడం కోసం దేశాధినేతలు చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని సిపిఎం కోరుతుందన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడితో పాటు, ఉక్రెయిన్, రష్యాల యుద్ధం కూడా ప్రారంభమైందన్నారు. ఎక్కడ యుద్ధాలు జరిగినా పసిపిల్లలు మహిళలు మారణ హోమంలో బలవుతున్నా రన్నారు. మన ప్రధాని నరేంద్ర మోడీ ఉక్రెయిన్‌కు వెళ్లి యుద్ధాన్ని ఆపినట్లుగా ఫోజులు పెడుతున్నారన్నారు. యుద్ధం విరమించడం కోసం మోడీ దగ్గర ఉన్న విధానం ఏంటో బయట పెట్టని పరిస్థితి ఉందన్నారు. మోడీ ఉక్రెయిన్ పర్యటన అనేది సామ్రాజ్యవాద దేశాల మద్దతును, సానుభూతిని పెంచుకోవడం కోసం చేసిన ప్రయత్నంలా కనిపిస్తుందన్నారు. మన దేశ అలీన విదేశాంగ విధానాన్ని వారసత్వంగా కొనసాగించా లన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఎలాంటి మార్పు లేదని, పాత విధానాలనే కొన సాగిస్తోం దన్నారు. మైనార్టీల పైన, దళితులపైన దాడులు తగ్గకపోగా, వ్యవస్థీకృతంగానే వాళ్ళను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నా యన్నారు. వక్ఫు చట్టము, సెక్యులర్ సివిల్ కోడ్ లాంటి వాటి పేరుతో ఆయా తరగతులను అభద్రతాభావం లోకి నెడుతున్నారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో మార్పు వచ్చిన తర్వాత నూతన ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టిని సారించాలన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా రైతుల పంటలు దెబ్బతినడంతో పాటు, విజయవాడ లాంటి ప్రాంతంలో ఉప్పొంగిన వరదల కారణంగా ప్రజలు కకావికలమయ్యారన్నారు. వరదల తీవ్రత ప్రభావం ఏమిటో ఇప్పటికే నష్టపోయిన మనకు తెలుసనని, నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు ప్రతి కార్యకర్త ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ పార్టీ దేశవ్యాప్త నిర్మాణంలో భాగంగా సెప్టెంబర్ 10 నుండి అక్టోబర్ 10 లోపు గ్రామస్థాయి, డిసెంబర్ లోపు మండల జిల్లా స్థాయి కమిటీల నిర్మాణాన్ని నిర్దిష్టమైన ప్రణాళికతో నిర్వహించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకష్ణ, పి.నిర్మల, జి.రామకృష్ణ, కెవి. నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎండి అంజిబాబు, ఎండి.ఆనంద్‌బాబు, అరుణమ్మ, ఎన్.అలివేలు, టి.రాముడు, ఎం.రాజశేఖర్, హనుమంతు, వీరశేఖర్, మధు, గురుశేఖర్, విజయ్, నగేష్, మోహన్ తోపాటు వివిధ మండలాల పట్టణాల నుండి హాజరైన నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

వరద బాధితులకు రూ.కోటితో 10 వేల కిట్లు సిద్ధం

- మంత్రి టిజి.భరత్, టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

విజయవాడ వరద బాధితులకు అందించేందుకు 10 వేల నిత్యావసర సరుకుల కిట్లు సిద్ధం చేసినట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్, తెలుగుదేశం పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. మౌర్యఇన్‌లోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా టిడిపి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలు, నాయకుల సహకారంతో పది వేల కిట్లు తయారుచేసినట్లు చెప్పారు. ఒక్కో కిట్‌లో 5 కేజీల బియ్యం, 1 కేజి కందిపప్పు, 1 కేజీ చక్కెర, ఉప్మారవ్వ, కారంపొడి తదితర నిత్యావసర వస్తువులు ప్యాక్ చేసి పెట్టామన్నారు. రూ.ఒక కోటి ఖర్చు చేసి పది వేల కిట్లను సిద్ధం చేశామని చెప్పారు. మంగళవారం విజయవాడలో వీటిని పది వేల కుటుంబాలకు అందజేయనున్నట్లు తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకారం అందించిన పార్టీ కార్యకర్తలు, దాతలకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న మంత్రి టిజి భరత్, టిడిజి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

డిసిసి అధ్యక్షుడిగా మురళీకృష్ణ

నగర అధ్యక్షుడుగా జిలాని బాష

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

మురళీకృష్ణ

జిలానీ బాష

కర్నూలు జిల్లా నూతన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణను నియమిస్తూ పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా షేక్ జిలాని బాషను నియమించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేసేలా దృష్టి సారిస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన డిసిసి అధ్యక్షుడిగా నియమితులైన మురళీకృష్ణకు పలువురు కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

విద్యుత్ తీగలకు అల్లుకున్న తిప్పతీగ తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు రెవెన్యూ కాలనీలో విద్యుత్ తీగలకు చుట్టుకుపోయిన తిప్పతీగను తొలగించాలని విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు వార్డు నాయకులు ఎం. భాస్కర్, వి.శంకర్, ఎస్.రోశయ్య, ఎం.మద్దిలేటి, కె.విక్రం, భీసన్న ,నాగరాజు మనోహర్‌లతో కలిసి పర్యటన చేసి ప్రజల ప్రాణాలు గాలికి వదిలేసిన విద్యుత్ అధికారులు అనే వార్తకు ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎం.ఉమాపతి వెంటనే స్పందిస్తూ అధికారులను సిబ్బందిని ఆదేశించి ఆరు గంటలు శ్రమించి విద్యుత్ తీగలకున్న తిప్పతీగను తొలగించారు. ప్రజలకు ఉన్న ప్రమాదాన్ని గమనించి వెంటనే చర్యలు తీసుకుని విద్యుత్ తీగల కున్న తిప్పతీగను తొలగించినందుకు ఎస్ఇ ఉమాపతి, ఎడి, నాగ ప్రసాద్, ఎఇ సంజీవ రెడ్డి, విద్యుత్ సిబ్బందికి వర్కర్లకు సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు ధన్యవాదాలు తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు సి.గురు శేఖర్.ఎం.భాస్కర్, ఎన్.మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ స్వీకరణ

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట

ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సోమవారం నాడు గ్రీవెన్స్ (వినతులస్వీకరణ) కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మున్సిపల్ రెవెన్యూ మండల కేంద్రాల్లో యధావిధిగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

వినాయక ఘాట్‌ను పరిశీలించిన ఎస్‌పి

భద్రత ఏర్పాట్ల గురించి ఆరా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వినాయక నిమజ్జన ఘాట్‌ను ఆదివారం జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ పరిశీలించారు. కెసి కెనాల్ , వినాయక్ ఘాట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. త్వరలో నిర్వహించబోయే గణేష్ నిమజ్జనం సంధర్భంగా వినాయక విగ్రహాలు బయలుదేరే మొదటి రాంబోట్ల దేవాలయం, బాదం మాస్క్ మీదుగా, కింగ్ మార్కెట్ , కొండారెడ్డి బురుజు మీదుగా అంబేద్కర్ సర్కిల్, రాజ్‌విహార్ మీదుగా వెళ్లే వినాయక విగ్రహాల ఊరేగింపు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం వినాయక నిమజ్జనం ఘాట్లోని కేసి కెనాల్ దగ్గర వినాయక విగ్రహాలను ఎత్తే భారీ క్రేన్లను దానికి సంబందించిన డ్రైవర్లను, గజ ఈత గాళ్ళను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఇతర శాఖలకు అధికారులకు ఆదేశించారు. జిల్లా ఎస్పి వెంట కర్నూలు డిఎస్పి జె.బాబు ప్రసాద్, సిఐలు ప్రసాద్, రామయ్య నాయుడు, మురళీధర్ రెడ్డి, కేశవరెడ్డి, నాగరాజరావు, ట్రాఫిక్ సిఐ మనసూరుద్దీన్, గణేష్ ఉత్సవ సమితి కమిటి సభ్యులు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

నిమజ్జనానికి వినాయక ఘాట్‌నుపరిశీలిస్తున్న ఎస్‌పి బిందుమాధవ్

వినాయకునికి ప్రత్యేక పూజలు చేస్తున్న కలెక్టర్

వినాయకునికి కలెక్టర్ ప్రత్యేక పూజలు

కర్నూలు కలెక్టరేట్ : కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆయనకు వేద పండితులు ఆశీర్వాదాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతోపాటు ఇన్చార్జి డిఆర్ఒ చిరంజీవి కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరి ఎపి రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గిరికుమార్‌రెడ్డి, నాగరాజు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సి బెళగల్ : మండలంలోని అన్నీ గ్రామాల్లో వినాయకులు కొలువు తీరారు. పలు చోట్ల దాతలు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేశారు.

జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిని వినాయక విగ్రహాలు

కర్నూలు జిల్లా వ్యాప్తంగా వినాయణ విగ్రహాలు కొలువుదీరాయి. మూడురోజులలో కొందరు. ఐదు రోజులలో , ఏడు, తొమ్మిది రోజులలో వినాయక విగ్రహాలకు నిమజ్జనం చేయనున్నారు.

ధైర్యశీలి, రాజనీతిజ్ఞుడు ఆంధ్ర కేసరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్య శీలి, రాజనీతిజ్ఞుడు అని క్లస్టర్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో క్లస్టర్ యూనివర్సిటీ , సాహితీ సదస్సు సంయుక్తంగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు , మేడూరి దీక్షితులు వెంకటసుబ్బయ్య జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాడిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డివిఆర్ సాయి గోపాల్ పాల్గొని మాట్లాడారు. మేడూరి దీక్షితుల వెంకటసుబ్బయ్య సాహిత్య సేవలను కొనియాడారు. అతి పేదరికం నుండి అత్యంత మేధావిగా రాజనీతిజ్ఞుడుగా, న్యాయవాదిగా ఎదిగి దేశ స్వాతంత్ర సమరంలో ప్రధాన పాత్ర వహించరన్నారు. కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ మాట్లాడుతూ ప్రశాతంగా విగ్రహ ప్రతిష్ట చేసి ప్రతిఒక్కరు వారి స్పూర్తితో ప్రభావితులం కావాలన్నారు. ఈ సదస్సులో రాజమహేంద్రవరం నుండి ఆంధ్ర కేసరి యువజన సంఘ కార్యదర్శిమాదిరాజు శ్రీనివాస్, జెఎస్ఆర్‌కె.శర్మ మాట్లాడుతూ మేడూరి దీక్షితులు వెంకటసుబ్బయ్య సాహితి సదస్సును స్థాపించి భాష సాహిత్యసేవకు బాట వేశారన్నారు. డిగ్రీ కళాశాలల విద్యార్థుల వకృత్వ పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. కావెం సుబ్బలక్ష్మమ్మ, కె.సునీత, పి.సునంద న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రసంగాలు సభను భావోద్వేగంతో నింపటం విశేషం. విద్యార్థులకు రూ. 2000, రూ.1500, రూ.500, ప్రోత్సాహక బహుమతులు, పదిమంది విద్యార్థులకు రూ.500 ప్రోత్సహక బహుమతి సర్టిఫికెట్, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా అధ్యాపకులు డాక్టర్ దండెబోయిన పార్వతి దేవి వ్యవహరించారు.

మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ విసి సాయిగోపాల్

కారు అదుపు తప్పి ముగ్గురు మృతి

ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-ఆలూరు

కర్నూలు జిల్లా ఆలూరు మండలం హుళేబీడు గ్రామ సమీపంలో కారు అదుపు తప్పి ముగ్గురు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి 8 గంటల 20 నిమిషాలకు జరిగింది. వివరాల్లోకి వెళితే ఆదోనికి చెందిన వారు బళ్ళారి నుండి ఆదోనికి వస్తుండగా హుళేబీడు దగ్గర అదుపు కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో సబీర(66),గౌస్(45) నశ్రీనా (40) మతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

28న జాతీయ కవయిత్రుల సమ్మేళనం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ఈనెల 28న సావిత్రిబాయి పూలే పేరిట కర్నూల్లో జాతీయ కవయిత్రుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గణేష్ సాహితీ సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. 2018 లో ప్రారంభించిన జాతీయ కవయత్రుల సమ్మేళనం నిర్వహిస్తూ వస్తున్నామని, ఈ సమ్మేళనకు వివిధ ప్రాంతాల కవయత్రులు పాల్గొంటూ వస్తున్నారని ఆయన తెలిపారు. ఏడవ జాతీయ కవయత్రుల సమ్మేళనం కర్నూలు లోని దిన్నదేవరపాడు గ్రామంలోని ఆర్‌టిసి కాలనీలో గణేష్ సాహితీ సదన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మేళనానికి పాల్గొనదల్చుకున్న వాళ్ళు ఈనెల 17వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు (వాట్సప్ నెంబర్ 9 4 4 0 2 2 8 9 9 9).

కూలిన మట్టి మిద్దెలు

ప్రజాశక్తి-వెల్దుర్తి

వెల్దుర్తి మండలంలో ఇటీవల ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నాలుగు మట్టి మిద్దెలు కూలాయి. రామల్లకోట గ్రామం దాసరి వీధిలో పింజరి నడిపన్నకు చెందిన మట్టి మీద కూలి ఇంట్లో వంట చేస్తున్న జైనూబి మీద మిద్దెపడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుమారు లక్షమేర ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి ఎస్ఐ అశోక్‌బాధితురాలు చికిత్స కోసం రూ.ఐదువేల ఆర్థిక సహాయం అందించారు. వెల్దుర్తి పట్టణంలో రెండో వార్డులో నివాసముంటున్న సువర్ణమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని బాధితులు తెలిపారు. రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందన్నారు. మండల పరిధిలోని లింగాలపల్లిలో నాగరాజు, రాజులకు చెందిన మట్టి మిద్దెలు కూలిపోయాయి. కుటుంబ సభ్యులందరూ పొలం పనులకు వెళ్లన సమయంలో ప్రమాదం జరగడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. వీరికి ఒక్కొక్కరికి రూ.లక్ష మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఇల్లు కూలడంతో నిరాశ్రయలమయ్యామని ప్రభుత్వమే ఎలాగైనా ఆదుకోవాలని బాధితులు కోరారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటలు

- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-దేవనకొండ

ప్రకృతి వైపరీత్యాలతో రైతుల ప్రతి ఏటా దిగుబడులు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది వర్షాలు లేక కరువుతో విలవిలలాడి తీవ్రంగా నష్టపోతే ఈ ఏడాది అధిక వర్షాలకు చేతికొచ్చిన పంటలు కళ్ళముందే దెబ్బ తినడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. పంటల పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరిగిపోతాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత 12 రోజుల నుండి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వ్యవసాయ ఖరీఫ్ సీజన్‌లో దేవనకొండ మండలంలో 65వేల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. మండలంలో ప్రధానంగా పత్తి, టమోటా, ఆముదము, వేరుశనగ , మిరప, చోళకాయ వంటి పంటలను రైతులు సాగు చేశారు. పంటల సాగుకు వేలాది రూపాయల పెట్టుబడి పెట్టారు. ప్రధానంగా పత్తి పంట చేతికొచ్చిన సమయానికి వర్షాలకు పత్తి కాయలు కుళ్ళు రావడంతో రైతులు

తీవ్రంగా నష్ట పోయారు. మండలంలో 35 వేల ఎకరాల్లో పత్తి పంట రైతులు సాగు చేశారు. ఎకరా పత్తి పంట సాగు కోసం రూ. 40 వేలు దాకా పెట్టుబడి అయిందని పెట్టుబడి కూడా చేతికి వచ్చే పరిస్థితులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా టమోటా పంట అధిక వర్షాలతో దాదాపు 3000 ఎకరాల పంటకు నష్టం వాటిల్లింది. వ్యవసాయ బావులు బోర్ల కింద సాగుచేసిన వేరుశనగ కూడా దెబ్బతిన్నది. కూరగాయల పంటలు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- వీర శేఖర్, వ్యకాస నాయకులు

దేవనకొండ మండలంలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. పత్తి, టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా వేరుశనగ పంటలు సైతం దెబ్బతినడంతో రైతుల బాధలు వర్ణాతీతం. సంబంధిత శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ఎకరాకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించాలి.

పత్తి పంట పూర్తిగా దెబ్బతింది

- షేకన్న, దేవనకొండ

నాలుగు ఎకరాల పొలంలో పత్తి పంటను సాగు చేశాను. అధిక వర్షాలకు పత్తి కాయలకు కుళ్ళు వచ్చి పూర్తిగా దెబ్బతింది. నాలుగు ఎకరాలకు రూ.1.60 లక్షలు పెట్టుబడి అయింది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. రైతుల పంటలను పరిశీలించి ఆదుకోవాలి.

ముళ్ల చెట్లమయం ఆరోగ్య ఉపకేంద్రం

- అద్దె భవనంలో సేవలు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కింద స్థాయిలో మారుమూల గ్రామాలలో ఉన్న నిరుపేద ప్రజలకు వైద్యం అందివ్వాలనే ఆకాంక్షతో కోట్ల నిధులు వెచ్చించి వైద్య భవనాలను నిర్మించి డాక్టర్లను విధులకు పంపుతున్నారు. అయితే వాస్తవానికి ప్రభుత్వాలు అనుకున్నంత మేర కింద స్థాయిలో వైద్యం అందివ్వడం లేదని గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజలు చెబుతున్నారు. మండలంలోని పెద్ద గ్రామమైన నేమకల్లులో ఆరోగ్య ఉప కేంద్రం ఉన్నా కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగకరంగా ఉంది. వైద్య సిబ్బంది దానిని పక్కనపెట్టి గ్రామంలో అద్దె భవనంలోనే వైద్య సేవలు అందిస్తున్నారు. నేమకల్లు గ్రామానికి మజార గ్రామం సంఘాల మరియు చుట్టుపక్కల గ్రామాలు తిమ్మాపురం, నగర డోనా, బెల్డోన ఒక కిలోమీటర్లు రెండు కిలోమీటర్లలోనే దగ్గర ఉన్నాయి. దాదాపు 15 వేల జనాభా ఉన్నప్పటికీ ఆరోగ్య ఉప కేంద్రం నిష్ప్రయోజనంగా ఉన్నా దానిని మరమ్మతులు చేయటానికి ప్రజా ప్రతినిధులు గాని, వైద్య సిబ్బంది ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆరోగ్య ఉప కేంద్రం అన్ని వసతులతో ఉన్నట్లయితే ఈ చుట్ట గ్రామాల్లో ఉన్న గర్భవతులు, బాలింతలకు, వృద్ధులకు వైద్యం చేయించుకోవడానికి సులభతరం అవుతుందని ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు వైద్య అధికారులు స్పందించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించుకుని ఆరోగ్య ఉప కేంద్రమును పునర్నిర్మాణం చేయించి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తేవాలని చుట్టుపక్కల గ్రామాలలో ఉన్న ప్రజలు కోరుతున్నారు.

ముళ్ల చెట్ల మధ్య ఆరోగ్య నేమమల్లు ఆరోగ్య ఉపకేంద్రం

అందుబాటులోకి వస్తే మహిళలు సంతోషపడతారు

- రాజేశ్వరి, నేమకల్లు

నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంను ప్రభుత్వం దయవుంచి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించి అందుబాటులోకి వచ్చి వైద్య సిబ్బందిని నియమించి సేవలందిస్తే గర్భవతులు, బాలింతలు, వృద్ధులు సంతోష పడతారు. దయవుంచి ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే ఆరోగ్య ఉపకేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి.

మీనాక్షి నాయుడు వెంటే మేము సైతం

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో అన్ని వర్గాల ఐక్యత, అభివృద్ధికి బాటలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షినాయుడు నాయకత్వాన్ని బలపరుస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామని టిడిపి మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు అప్సర్ బాష స్పష్టం చేశారు. ఆదివారం ఆదోనిలో ఆయన గృహములో మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో సన్మానం చేశారు. అప్సర్ బాషా మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ జీవితంలో మీనాక్షి నాయుడు చాణుక్య నీతితో ఆదోనిలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తామని, ప్రత్యేకంగా ఆదోనిలో శాంతియుత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా టిడిపి కార్యకర్తలు నాయకులు కృషి చేస్తున్నామని వివరించారు. ఆదోని నియోజకవర్గంలోను, జిల్లా వ్యాప్తంగాను వినాయక చవితి పండుగను కుల మతాలకతీతంగా అన్ని వర్గాల వారు కలిసిమెలిసి జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారన్నారు. మీనాక్షి నాయుడు జీవితాంతం ఆదోని అభివృద్ధికి, ప్రజల ఐక్యతకు, సంక్షేమానికి కృషి చేస్తారని తెలిపారు.



పూలమాలతో మీనాక్షి నాయుడు ను సన్మానించిన అప్సరభాష

మానవతవాదులు స్పందించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

వరద ముంపుతో నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు మానవతా వాదులు ముందుకు రావాలని ఎమ్మెల్యే పార్థసారథి విజ్ఞప్తి చేశారు. విజయవాడ వరద బాధితులకు సహాయార్థం ఆదోని పట్టణంలోని ప్రధాన రహదారుల మీద జోలిపట్టి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి భిక్షాటన చేశారు. ఆదివారం ఆదోనిలో బీమాస్ హోటల్లో పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విజయవాడలో వరదల్లో నష్టపోయిన అనేక కుటుంబాలు ధన , ప్రాణ, ఆస్తి నష్టాలు జరిగిందని ఆవేదన వేక్తం చేశారు. నష్టపోయిన ప్రజలకు మనోధైర్యాన్ని కల్పిస్తూ తనవంతు సహాయం అందించాలని ఆదోని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే తన నెల మొత్తం జీతన్ని ఇస్తునట్లు ప్రకటించారు. బీజేపీ నాయకులు, భీమాస్‌హోటల్ ఛైర్మన్ విట్ట రమేష్ రూ.లక్ష, బీజేపీ నాయకురాలు మల్లిక రూ.50 వేలు, చిన్నబసప్ప రూ.25 వేలు విరాళం ప్రకటించారు. అసోసియేషన్ వారిగా పుర ప్రముఖులు స్పందించి సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకోసం భిక్షాటన చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

మాన్యం భూములు కబ్జా

- ఎండోమెంట్ అధికారి నరేంద్ర

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద గ్రామ శివారులో అగ్రహారం ఆంజనేయ స్వామి దేవాలయానికి చెందిన మాన్యం భూములు కబ్జాకు గురైనట్లు ఎండోమెంట్ అధికారి నరేంద్ర ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అగ్రహారం ఆంజనేయస్వామి మన్యం భూములు 50 ఎకరాలకు పైగా ఉన్నట్లు దేవాదాయ శాఖ రికార్డులో ఉండగా అనుభవంలో మాత్రం 33 ఎకరాలు ఉందన్నారు. మిగతా 18 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తెలిపారు. అలాగే హెుళగుందలోని కోట ఆంజనేయ స్వామికి చెందిన మాన్యం భూములు 30 ఎకరాలకు పైగా ఉన్నట్లు రికార్డులో ఉన్నా, అవి ఎక్కడ ఉన్నాయో, ఎవరి అధీనంలో ఉన్నాయో ఇప్పటికి తెలియకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా కబ్జాకు గురైన ఆలయ భూములను ఎండోమెంట్ అధికారులు స్వాధీనం చేసుకొని దేవాలయం అభివృద్ధికి పాటు పడాలని భక్తులు కోరుతున్నారు. అలాగే హోళగుంద మండలంలోని ఎండోమెంట్‌కు చెందిన దేవాలయాలకు ఈఓను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజా పొంపన్న గౌడ, పొంపపతి, ఎర్రిస్వామి, దిడ్డి వెంకటేష్, అంజి, భక్తులు ఉమేష్, రఘు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎండో మెంట్ అధికారి నరేంద్ర

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఆదోని రూరల్

మండలం పరిధిలో పెద్దహరివణం గ్రామంలో గ్రామ సర్పంచ్ హెచ్.రాము, పంచాయతీ కార్యదర్శి నాగరాజ్ ఆధ్వర్యంలో పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పూడికలు దగ్గరుండి తీయించారు. ట్రాక్టర్ ద్వారా గ్రామంలో పురవీధుల్లో మందు పిచికారి చేయించారు. దోమలను నివారించడానికి ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజుల కురుస్తున్న వర్షానికి ప్రజలు దోమల బారిన పడి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా లార్వా స్ప్రేయింగ్ చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఎంకప్ప గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల నివాణకు మందును పిచికారి చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

ఇళ్ల మధ్యనే వర్షపు నీరు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆదోని

చిన్నపాటి వర్షం కురిసినా ఇళ్ళ మధ్యలో నీరు చేరి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఆ ప్రాంతాల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆదోని పట్టణంలో క్రాంతి నగర్ ఎక్స్టెన్షన్, రాజా సాహెబ్ నగర్‌లలో సుమారు 100 కుటుంబాలు నివసిస్తున్నారు. ఇల్లు పల్లపు ప్రాంతంలో ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసిన ఇళ్ల మధ్యనే చేరి చాలా రోజులుగా నిలువ ఉంటున్నాయి. నీళ్ల నిలవడం వల్ల ముళ్ల కంపలు పిచ్చి మొక్కలు పెరిగి ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయని ఆ కాలనీవాసులు చెబుతున్నారు. ఇళ్ల మధ్యలో నీరు నిలవడం వల్ల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. పాదచారులైతే నీళ్లలో పాదాలు తడుపుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. సాయంత్రం అయితే దోమల మోత మోగుతుందని, నీరు నిలవకుండా కనీసం గ్రావెలైన వేయాలని మున్సిపల్ అధికారులకు విన్నవిస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఇళ్లమధ్య నిలిచిపోయిన వర్షపు నీరు

కాలువల్లో పేరుకు పోయిన చెత్త

రోగాల బారిన పడుతున్నాము- ఈరమ్మ

ఇళ్ల చాటున నీళ్లు ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది దండయాత్ర చేస్తున్నాయి. దోమ కాటువల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధుల బారిన పడుతున్నాము. వచ్చిన కూలి డబ్బులు ఆసుపత్రిలోనే చికిత్సలకే సరిపోతున్నాయి. కనీసం దోమలు వృద్ధి కాకుండా నివారణ చర్యలు కూడా తీసుకోవడం లేదు.

కన్నెత్తి చూడని పారిశుద్ధ కార్మికులు

- ముని, కాలనీవాసి.

కాలనీలో సిమెంట్ రోడ్లు లేవు. అక్కడక్కడ డ్రైనేజీ వేసిన పూర్తిస్థాయిలో నిర్మాణం జరగలేదు. మట్టి రోడ్లు ఉండడంవల్ల చిన్నపాటి వర్షం వచ్చిన బురదమయం మారుతుంది. నిలిచిన నీటిలో కనీసం బ్లీచింగ్ పౌడర్ కాలువలులోనే పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు కన్నెత్తి చూడడం లేదు. శివారు ప్రాంతాల వైపు నిర్లక్ష్యం చేయడం తగదు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి- దేవనకొండ

విజయవాడలో వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు దేవనకొండ మండలం తెలుగుదేశం పార్టీ, జనసేన తరఫున సేకరించిన రూ.4,94,700 ను ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ్ కు ఆదివారం మండల టిడిపి కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, జిల్లా పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శిరాందాస్ గౌడ్, టిడిపి నాయకులు మలకన్న, ఆకుల వీరేష్, రామారావు నాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధితులకు ఆర్థిక సాయం పెద్ద మొత్తం అందించిన వారిలో గుండ్లకొండ రామదాసు గౌడ్ రూ.50వేలు, వెంకటసాయి ట్రేడర్స్ రూ.50వేలు, కుంకనూరు గ్రామం రూ.33వేలు, సాయి గణేష్ ట్రేడర్స్ రూ.20వేలు, చెల్లల చెల్లమల నాగేంద్ర గౌడ్ రూ.20వేలు అందించారన్నారు. ఈ సందర్భంగా విరాళాలు అందజేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ వార్డెన్ కురువ రాముడు మృతి తీరని లోటు

- కురువ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : మాజీ వార్డెన్ కురువ రాముడు మృతి తీరని లోటు అని కురువ సంఘం అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న, జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పత్తికొండ శ్రీనివాసులు ఎంకె.రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, జిల్లా ఉపాధ్యక్షులు కెటి ఉరుకుంద, ధనుంజయ, కోశాధికారి కెసి నాగన్న, నగర అధ్యక్ష, కార్యదర్శి తవుడు శ్రీనివాసులు, కొత్తపల్లి దేవేంద్ర తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

బడికి 100 అడుగుల దూరంలో కల్లు దుకాణం

ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ మండలం యనగండ్ల ప్రాథమిక పాఠశాలకు 100 అడుగుల దూరంలోనే కల్లు దుకాణం ఉంది. పాఠశాలకు వెళ్లేప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు విద్యార్థులు ఆ కల్లు దుకాణం దాటి వెళ్లి రావాల్సిందే. కల్లు దుకాణం యజమాని మాత్రం అడిగేవారు లేరని తగిన వేళలు పాటించకుండా తెరుచుకొని ఉండటం వలన కల్లు తాగుడు వాళ్లు ఎప్పుడు పడితే అప్పుడు తాగి వెళ్తున్నారు. కొందరైతే తప్పతాగి ఊగుతూ పొర్లుతూ అటుగా వెళ్తున్న విద్యార్థులపై పడి లేచిన సందర్భాలు ఉన్నాయి. ఇక్కడే విద్యార్థులు, బాలికలు తాగుబోతులు తాగి పడుతున్నప్పుడు వచ్చే కంపు, వారి ప్రవర్తనను చూసి భయందోళనకు గురవుతున్నారు. తరచూ తాగుబోతులు ఒకరిపై ఒకరూ చేసుకొనే రచ్చలపైన, వీరంగాల పైన చూస్తున్న విద్యార్థులకు, తరగతి గదిలో కూడా ఉన్న విద్యార్థులకు విద్య బోధ పడటం లేదని తెలుస్తోంది. ఇక్కడే తాగుబోతుల ప్రభావం పిల్లలపై పడుతుందని, కల్లు దుకాణం పాఠశాలకు దూరంగా ఏర్పాటు చేసేలా అధికారులు, పోలీసులు తగు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

మంత్రాలయంలో వినాయకునికి విశేష పూజలు

ప్రజాశక్తి-మంత్రాలయం

మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వక్రతుండునికి విశేష పూజలతో మంగళారతి చేశారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి స్థానిక సంత మార్కెట్‌లో కొలువైన గణనాథుడికి పూజలు నిర్వహించారు. మంఢపం నిర్వాహకులు ఆయనకు, టిడిపి పట్టణ ఇంచార్జి బి వరదరాజులుకు శాలువలతో పూలమాలలు వేసి సన్మానించారు. ఆయన వెంట టిడిపి నాయకులు టైగర్ రఘు మేకల నరసింహ బావిగడ్డ రాఘన్న తదితరులు ఉన్నారు.



గోనెగండ్ల : గోనెగండ్లలోని శ్రీరామ నగర్ కాలనీలో మేజర్ సర్పంచ్ హైమావతి చంద్రశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో వినాయకున్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలు చోట్ల ఎమ్మెల్యే బివి ప్రత్యేక పూజలు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణంలోని తేరుబజార్‌తో పాటు పలు ప్రాంతాల్లో గణనాథులను ఎమ్మెల్యే బివి. జయ నాగేశ్వర రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని మండపాలలో 300 గణనాథులను ప్రతిష్ఠించారు

ఆస్పరి: తో పాటు ఆయా గ్రామాలలోని వీధి వీధిన గణేష్‌ని మండపాలలో శనివారం కొలువుదీరిన వినాయకుడి విగ్రహాలు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గణనాథునికి వివిధ రకాల వంటకాలతో నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ఎపి వేర్ హౌజ్ హమాలీ యూనియన్ సమావేశంలో కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు కార్పోరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎపి వేరేహౌస్ హమాలీ యూనియన్ విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశం సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. సమావేశానికి సిఐటియు నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎపిరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబాలు మాట్లాడారు. దేశ సంపదకు సృష్టికర్త అయిన కార్మికులు కష్టించి పనిచేస్తూ శ్రమశక్తి ద్వారా సంపదను సృష్టించే కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక, పిల్లలను చదివించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. పాలకులు మాత్రం కార్మికుల సంక్షేమం గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం లోని బిజెపి, రాష్ట్రటిడిపి ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించే విధంగా యజమానులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను చేస్తూ నిరంకుశ పాలనను కొనసాగిస్తున్నాయన్నారు. కులం, మతాన్ని అడ్డం పెట్టుకొని దేశంలో విధ్వంసాన్నిసృష్టిసూ ఐక్యమత్యంగా ఉన్నటువంటి ప్రజలనుమధ్యన చిచ్చు పెడుతూ, విచ్ఛిన్నం చేస్తూ అరాచక పాలన చేస్తున్నారన్నారు. కార్మికులుపోరాటం ద్వారాసాధించుకున్న 44 లేబర్ కోడ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు కోడులుగా చేసి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. దేశ సంపదకు మూలపురుషులైనా కార్మికుల గురించి పట్టించుకోకుండా దేశ సంపదను దోచుకునే కార్పొరేట్లకు దాసోహం అంటున్నాయన్నారు. కార్మికుల సంక్షేమం గురించి మాట్లాడితే డబ్బులు లేవని చెప్పేటువంటి ప్రభుత్వాలు బడా కార్పొరేట్లకు రూ.లక్షణాది కోట్ల రాయితీస్తూ దేశ సంపదను దోచిపెడుతున్నాయన్నారు. కార్మిక వర్గం చైతన్యవంతంగా రాజకీయాల్లో జోక్యం చేసుకొని రాజకీయ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్మిక వర్గ సమస్యలను అసెంబ్లీలో పార్లమెంట్లో మాట్లాడకపోతే సంక్షేమం గురించి పట్టించుకోకపోతే రాబోయే రోజుల్లో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరికలు కార్మిక వర్గం చేయాలని, కార్మిక, కర్షక,రైతు పోరాటాల ద్వారా మొద్దు నిద్రపోతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మబ్బు వదిలేలాగా కార్మిక వర్గం ఐక్యపోరాటాలకి సిద్ధం కావాలనీ పిలుపునిచ్చారు. యూనియన్ సెక్రటరీ జయన్న కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెట్టారు. యూనియన్ అధ్యక్షులు ఇ. విధేయుడు, ఎం.మల్లికార్జున యూనియన్ నిర్ణయాలను తీర్మానాలుగా ప్రవేశపెట్టారు. నూతనకమిటీనీ నిమిది మందితోఎన్నుకున్నారు.యూనియన్ అధ్యక్షులుగా కె.విష్ణుమూర్తి, కార్యదర్శిగా ఎం.మల్లికార్జున, జాయింట్ సెక్రెటరీ ఎం.పురుషోత్తం, వైస్ ప్రెసిడెంట్ కె. సుధాకర్, ట్రెజరర్‌గా టికె.మధు కృష్ణ, కమిటీ సభ్యులుగా కె. రంగన్న, ఆర్.గోవిందు, ఎన్.ఇసాక, లతో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలోచెన్నయ్య, సామేలు, నాగరాజు, శేఖర్, మద్దిలేటి , తదితరులు పాల్గొన్నారు.

సమావస్త్రశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకర్‌రెడ్డి

విజయవాడలో వరద బాధితులసహాయక చర్యల్లో కర్నూలు ఎస్ఎఫ్ఐ నాయకులు

వరద ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ బృందం సాయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో వరద ముంపు ప్రాంతంలో ప్రజలకు సహాయం చేయడం కోసం కర్నూలు జిల్లా నుండి జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, జిల్లా కమిటీ సభ్యులు ఖాజావలి, కర్నూలు నగర ఉపాధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రాంతాల్లో ప్రజలకు అన్ని నిత్యవసర సరుకులు, భోజనం ఇంటింటికి అందిస్తున్నామని చెబుతున్నారు తప్ప ప్రత్యక్షంగా చూస్తే ఎవరికి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ముఖ్యంగా ఏ సౌకర్యాలు కల్పించడం లేదు. అలాంటి పరిస్థితుల్లో ఎస్ఎఫ్ఐ బృందం వెళ్లి ప్రజలకు అన్ని రకాల నిత్యవసర సరుకులు భోజనం పంపిణీ చేస్తుంది. ముఖ్యంగా ఎస్ఎఫ్ఐగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరేది ఏమంటే ఇప్పటికే దాదాపు చాలామంది విద్యార్థులు వరద ముంపు వల్ల నిరాశ్రయులయ్యారు. అలాంటి విద్యార్థులకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి చదువుకోవడం కోసం ఆదుకోవాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కూడా కల్పించాలి.

వరద బాధితులను ఆదుకుందాం

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

ప్రజాశక్తి - ఆదోని

వరద బాధితులకు అండగా నిలబడదామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు ఆదివారం ఆదోని పట్టణంలో ప్రధాన రోడ్డులో దుకాణదారులు, పాదచారుల నుండి వరద బాధితుల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారిని ఆదుకునేందుకు అన్ని వర్గాలు ముందుకు రావాలన్నారు. ఆదోని పట్టణంలో ప్రజల నుంచి వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించామన్నారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర కమిటీ ద్వారా బాధితులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, గౌస్, నాయకులు నాగరాజు, శశిధర్, యశ్వంత్, విశ్వనాథ్, మోమిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలకు రెవిన్యూ బృందాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : విజయవాడలో వరద సహాయక చర్యలను పర్యవేక్షించింది గాను కర్నూలు జిల్లా నుండి రెవెన్యూ అధికారుల బృందాలు పంపించినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదివారం వెల్లడించారు. 14 మంది తహసీల్దారులతో పాటు 48 మంది డిప్యూటీ తహశీల్దార్లతో పాటు ఇతర రెవిన్యూ సిబ్బంది వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు పంపుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు.